క్లుప్తంగా

కుష్టు, క్షయ వ్యాధులను ఆరంభ దశలోనే గుర్తించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): కుష్టు, క్షయ వ్యాధులను ఆరంభ దశలోనే గుర్తించి చికిత్స అందించటం ద్వారా అంగవైకల్యం, ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చని జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ, క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఆధ్వర్యంలో సోమవారం అజిత్‌సింగ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో జిల్లా ఆశా నోడల్ అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టు వ్యాధి మైక్రో బ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా ద్వారా వచ్చే అతి సాధారణ వ్యాధి అన్నారు. చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, స్పర్శ కోల్పోవటం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఎండీటీ చికిత్స ద్వారా కుష్టువ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని అన్నారు. ఆరంభ దశలోనే వ్యాధిని గుర్తించటం ద్వారా అంగవైకల్యం బారిన పడకుండా నివారించవచ్చని అన్నారు. నిగూఢంగా దాగి ఉన్న కుష్టు కేసులను గుర్తించేందుకు గతనెల 20వ తేదీ నుంచి ఈనెల 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే, వ్యాధి నిర్ధారణ కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం ఎల్‌సీడీసీ కార్యక్రమం, స్పర్శ అవగాహన కార్యక్రమాల ద్వారా నిర్వహించే లెప్రసీ, టి.బి వ్యాధి లక్షణాలు, నివారణ, చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డి.పి.హెచ్.ఎన్.ఓ లిడియా, డి.సి.ఎం హరీష్, కిల్కారీ ప్రతినిధి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరుల తపశ్శక్తి సమాజానికి శ్రీరామరక్ష

సామవేదం షణ్ముఖ శర్మ



విజయవాడ కల్చరల్: ఆదిశంకరుల తపశ్శక్తి సమాజానికి శ్రీరామరక్ష అని సామవేదం షణ్ముఖ శర్మ సూచించారు. శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75 వర్ధంతి సందర్భంగా దుర్గాపురంలోని శివరామ కృష్ణ క్షేత్రంలో సోమవారం శంకర విజయం అంశంగా ఆయన ప్రసంగించారు. ఆది శంకరులు వేదంలో చెప్పిన కర్మలను పాటించాలని సత్ గురువుల సేవలో తరించాలన్నారు. జ్ఞాన మార్గాన్ని బోధించేవాడు గురువని, అంధకారంలో ఉన్న వారికి వెలుగును ప్రసాదించేవాడు గురువని వివరించారు. సద్గురువులు లభించడం పూర్వజన్మ సుకృతం వల్లనే సాధ్యమవుతుందన్నారు. భగవాన్ వ్యాస మహర్షి బ్రహ్మ సూత్రాలను రచించారని, వాటిని ఆదిశంకరులు సూత్రీకరించినట్లు తెలిపారు. శంకరాచార్యులు సాక్షాత్తూ పరమశివుని అవతారమన్నారు. ఒకప్పుడు భారతదేశంలో సైద్ధాంతిక గందరగోళం ఉండేదని, ఎవరికి తోచిన విధంగా వారు భాష్యం చెప్పేవారని, దేశం అల్లకల్లోలంగా ఉండేదని, అటువంటి పరిస్థితుల్లో ఆదిశంకరులు అవతరించినట్లు తెలిపారు. తొలుత భారతీ తీర్థ మహాస్వామికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శిష్ఠా హనుమత్ ప్రసాద్, జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి, దుర్గామల్లేశ్వర స్వామి విశ్రాంత కార్యనిర్వహణ అధికారి కేఎస్ రామారావు, మాజీ మేయర్ జంధ్యాల శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యాపార వేత్తలుగా ఎదగాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా నైపుణ్యాలు పెంచుకుని వ్యాపార వేత్తలుగా ఎదగాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యాన ఫ్రూట్ ప్రాసెస్డ్ ప్రొడక్ట్స్ తయారీలో శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ కార్యక్రమాన్ని వృక్షశాస్త్ర విభాగాధిపతి జి.స్వప్నతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు ఫ్రూట్ ప్రాసెస్డ్ ప్రొడక్ట్స్ తయారీలో అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. నాణ్యతా ప్రమాణాలతో పోషక విలువలు నష్టపోకుండా ఫ్రూట్ ప్రాసెస్డ్ ప్రొడక్ట్స్ తయారీ చేసేందుకుగానూ తాము ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. రిసోర్స్ పర్సన్ డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో వివిధ ఉత్పత్తులను తయారు చేయటం వల్ల దీర్ఘకాలం పాటు నిల్వ చేయవచ్చని తెలిపారు. విద్యార్థులకు వివిధ రకాల పండ్లను ఉపయోగించి స్క్వాష్, జ్యూస్, కెచప్, జెల్లీ, మిక్స్‌డ్ ఫ్రూట్ జామ్ వంటి పలు రకాల ఉత్పత్తులను వాటిలోని పోషకాలకు హాని కలగకుండా ఎక్కువ కాలం నిల్వ ఉండేలా తయారు చేయటం నేర్పించారు. కళాశాల వృక్ష శాస్త్ర విభాగాధిపతి జి.స్వప్న మాట్లాడుతూ తాము పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ పేపర్‌లో భాగంగా ఫుడ్ ప్రాసెస్డ్ ప్రొడక్ట్స్ తయారీలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

రూ.లక్షల్లో అద్దెలు..

రోడ్లపైనే వాహనాలు

- పశ్చిమంలో ఇబ్బడిముబ్బడిగా
- కన్వెన్షన్లు, ఫంక్షన్ హాళ్లు
- కనీస పార్కింగ్ లేకుండానే అనుమతులు
- చోద్యం చూస్తున్న పోలీసు, కార్పొరేషన్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పెళ్లయినా... పుట్టిన రోజైనా.... శ్రీమంతమైనా... చివరకు ఖర్మ అయినా ఫంక్షన్ హాల్లోనే... మారుతున్న మానవ జీవన విధానంలో ఫంక్షన్ హాల్లు, కన్వెన్షన్‌లు ఎంతో కీలకంగా మారిపోతున్నాయి. ఒకప్పుడు ఏ వేడుక ఉన్నా ఇంట్లో చేసుకుని నలుగురి చేత చేయి కడిగించుకుని వారితో పిల్లలకు అక్షింతలు వేయించడం ఆనవాయితీ. నేడు ఫంక్షన్ హాల్లో డాబుసరిగా వేడుకలు నిర్వహించడం గొప్పగా చెప్పుకునే పరిస్థితి నెలకొంది. దీంతో పశ్చిమ నియోజక వర్గంలో ఎక్కడ చూసినా ఫంక్షన్ హాల్స్, ఎ నుంచి జడ్ వరకు అన్ని అక్షరాలతో కన్వెన్షన్ హాల్ పుట్టగొడుగుల్లా వెలిశాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎన్ని ఫంక్షన్ హాల్స్ ఉన్నాయి.. వాటికి ఉండాల్సిన అనుమతులన్నీ ఉన్నాయా అంటే లేదు. పశ్చిమంలో సుమారు 100కు పైగా ఫంక్షన్ హాల్స్ , కన్వెన్షన్లు ఉంటే వాటిలో దాదాపు సగానికి పైగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవే.

కనీస పార్కింగ్ సదుపాయం సున్నా !

పశ్చిమ నియోజక వర్గంలోని రైల్వే స్టేషన్, వన్‌టౌన్‌లోని పాతబస్తీ, చిట్టినగర్, చేపల మార్కెట్, పాలప్రాజెక్టు, భవానీపురం, గట్టు వెనుక ప్రాంతాల్లో పదుల సంఖ్యలో కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్ ఇటీవల వెలిశాయి. అయితే ఈ ఫంక్షన్ హాల్స్ ఏర్పాటు చేసే క్రమంలో కార్పొరేషన్ అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. ఫంక్షన్ హాల్లో వంట చేసే గది నుంచి ఫంక్షన్లకు విచ్చేసే వారి వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేస్తున్నారనే దానిపై నివేదిక తీసుకోవాల్సి ఉంటుంది. ఏటా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతి ఫంక్షన్ హాల్ నుంచి చెత్త సేకరణకు ఎంత వసూలు చేస్తున్నామనే కార్పొరేషన్ అధికారులు ఆయా ఫంక్షన్ హాల్స్‌లో ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని సక్రమంగా ఉన్నాయా లేదా అనేది చూసుకోవాల్సిన బాధ్యత కూడా ఉంది. పదేళ్ల కిందట నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఇదే అంశంపై రెండు రోజుల పాటు సుదీర్ఘ చర్చ సాగింది. ఫంక్షన్ హాల్స్, సినిమా హాల్స్ వంటి వాటి నిర్వహణపై కార్పొరేషన్ బాధ్యత ఎంత వరకు అనే దానిపై చర్చ అప్పట్లో పెద్ద సంచలనమే. అయితే ఇటీవల పశ్చిమంలో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ పట్టుమని వంద నుంచి మూడు వందల గజాల లోపు ఉన్నవి అనేకం ఉన్నాయి. మరి కొన్ని ఫంక్షన్ హాల్స్ బహుళ అంతస్తులో ఉండగా, వాటిలో ఫైర్ సేఫ్టీ పరికరాలు ఎంత మేరకు ఉన్నాయి అంటే దిక్కులు చూడాల్సిందే.

అత్యవసర ద్వారాలున్నవి ఎన్ని!

పశ్చిమంలో ఉన్న అనేక ఫంక్షన్ హాల్ ఉన్నా.. వాటిలో అత్యవసర ద్వారాలు ఉన్నవి ఎన్ని అనే ప్రశ్న లేస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసర ద్వారాలు మచ్చకైనా కనిపించవు.. అయితే ఫంక్షన్ హాల్ లోపలకు వెళ్లే మార్గం, బయటకు వచ్చే మార్గం ఒకటే కనిపిస్తాయి. కొన్ని ఫంక్షన్ హాల్స్‌లో అయితే మెట్లపై నుంచి ఒకరిద్దరు కిందకు దిగితే.. పైకి ఎక్కే వారు పక్కన నిల్చోవాల్సిందే...ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ నడుస్తున్న నేపథ్యంలో ఫంక్షన్ హాల్స్‌పై కార్పొరేషన్, పోలీసు శాఖలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



సారంగం రోడ్డులోని కళ్యాణ మండపం



చేపల మార్కెట్ వద్ద పార్కింగ్ సదుపాయం లేని ఓ ఫంక్షన్ హాల్

రోడ్లపై పార్కింగ్ ఎందుకు కనిపించడం లేదు...!

అత్యవస పనిపై రోడ్డుపై పది నిమిషాలు బైక్ నిలిపితేనో... హెల్మెట్ లేకపోతే ఫైన్ వేసే ట్రాఫిక్ పోలీసులకు ఫంక్షన్ హాల్స్ ఎందుకు కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్ లోపల కాకుండా బయట రోడ్లపై వాహనాలు నిలిపినట్లయితే ఆయా ఫంక్షన్ హాల్ యజమానులకు జరిమానాలు విధిస్తే సరిపోతుందంటున్నారు. లక్షల్లో ప్యాకేజీలు తీసుకుంటున్న ఫంక్షన్ హాల్ యజమానులు సరైన సదుపాయాలను కల్పించాల్సిన అవసరం, బాధ్యత కూడా ఉన్నాయి.

సమర్థంగా కేసులు ఛేదించిన క్రైం పోలీసులకు రివార్డులు



విజయవాడస్పోర్ట్స్: అనతికాలంలోనే కేసులను సమర్థంగా ఛేదించిన 10 మంది క్రైం పోలీసులను పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు అభినందించి వారికి రివార్డులు అందజేశారు. పలు కేసుల్లో నేరస్తులను అరెస్ట్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్ఐలు బి.వి.స్వామి, సి.హెచ్. సత్యనారాయణ, ఎస్.కృష్ణమూర్తి, హెడ్ కానిస్టేబుళ్లు ఎం.ప్రకాష్‌రావు, జె.నాగరాజు, వి.రవికుమార్, కానిస్టేబుళ్లు జి.సురేష్, వి.వి.రమణ, షేక్ షబ్బీర్, జి.శిరీషకు నగదు రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో క్రైం డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావు, సీఐ ఎం.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు తిరుచ్చి ఉత్సవం

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో వేంచేసివున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాఘ మాసం రథసప్తమి సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, ఉదయం 6.30 గంటలకు జరిగే కార్యక్రమంలో కల్యాణమండపంలో స్వామి వారి ఊరేగింపు జరుగుతుందని భక్తులు స్వయంగా పాల్గొని స్వామి వారికి హారతి సేవను అర్పించవచ్చునని తెలిపారు.

కలెక్టర్ వచ్చి న్యాయం చేసే వరకు పోరాటం

- జక్కంపూడి ప్లాట్ల రైతుల ఆందోళన
- 711 ప్లాట్లలో రసాయనాలు డంపింగ్
- నష్టపోయిన 165 మంది రైతులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పరిశ్రమలో వాడిన రసాయనాలను ఖాళీగా ఉన్న ప్లాట్లలో డంపింగ్ చేయటం ద్వారా తీవ్రంగా నష్టపోయిన తమకు జిల్లా కలెక్టర్ వచ్చి న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని రైతులు తెగేసి చెప్పారు. ఈ మేరకు సోమవారం ప్లాట్ల వద్ద ఆందోళన చేపట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి ప్లాట్ల వద్ద విచారించారు. బాధిత రైతుల కథనం ప్రకారం విజయవాడ రూరల్ జక్కంపూడి 60–40 ప్లాట్ల లేఅవుట్‌లోని 130 ఎకరాల స్థలంలో 165 మంది రైతులకు చెందిన 711 ప్లాట్లు ఉన్నాయి. గత రెండున్నరేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేటలోని పరిశ్రమల నుంచి వచ్చిన వేస్ట్ రసాయనాలతో కూడన ట్యాంకర్లు అర్ధరాత్రి దాటిన తరువాత వచ్చి ఖాళీగా ఉన్న ప్లాట్లలో డంప్ చేసి వెళ్లిపోతున్నాయి. ఎన్నాళ్లుగా ప్రయత్నించినా ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వారు దొరకడం లేదు. చివరికి ప్లాట్ల రైతులు కొందరు ఆదివారం రాత్రి నిఘా వేసి 12 టైర్ల కెమికల్ ట్యాంకర్‌ను పట్టుకున్నారు. డ్రైవర్ బీరేందర్ రాయ్‌ను నిలదీయటంతో తాను యూపీకి చెందిన వాడినని, ట్యాంకర్ యజమాని పేరు రాజేంద్ర రెడ్డి అని, సూర్యాపేటలో లోడ్ చేసి గన్నవరం వెళ్లమని చెప్పారని తెలిపారు. అయితే అక్కడ డంప్ చేయడం కుదరకపోవడంతో ఒక వ్యక్తి పల్సర్ బైక్‌పై వచ్చి ఇక్కడ డంప్ చేయమని చెప్పి వెళ్లిపోయడని తెలిపాడు. కాగా పట్టుకున్న ట్యాంకర్ నంబర్‌కు దాని ఛాసిస్ నంబర్‌కు పొంతన లేదని రైతులు చెబుతున్నారు. మొత్తం ప్లాట్లలో దాదాపు 80 శాతం ప్లాట్లు రసాయనాలతో నిండిపోయాయి. తద్వారా భూమి సారవంతం కోల్పోయి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. ప్లాట్లకు చుట్టుపక్కల నాలుగు కిలోమీటర్ల వరకు రసాయనాల ప్రభావం చూపుతుంది. తీవ్రమైన దుర్వాసన, కళ్లు మండిపోవడం, ఊపిరి ఆడకపోవడం జరుగుతున్నాయని రైతులు చెబుతున్నారు. పిల్లలకు ఫిట్స్‌లా రావడం, ఒంటిపై ఎలర్జీ మాదిరిగా బొబ్బలు ఎక్కడం వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని రైతులు తెలిపారు.



ట్యాంకర్‌ను కదలకుండా నిలబడ్డ బాధితులు



రసాయనాలు డంప్ చేయడంతో నల్లగా మారిన ప్లాట్లలో నీళ్లు


నివాసం ఉండలేం.. అమ్ముకోలేం



పదేళ్ల క్రితం (2014) రిజిస్ట్రేషన్ చేసి ప్లాట్లు ఇచ్చిన అప్పటి ప్రభుత్వం ఆ తరువాత అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. దాంతో ఇక్కడ ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇళ్లు నిర్మించుకోలేదు. ఇప్పుడు ప్లాట్లన్నీ రసాయనాలతో నిండిపోయిన కారణంగా నిర్మాణాలకు పనికిరాదు. అమ్ముదామంటే ప్రస్తుత పరిస్థితిలో తెలిసినవారెవరూ ముందుకురారు. ఇటు నివాసం ఉండలేక.. అటు అమ్ముకోలేక నరకం అనుభవిస్తున్నాం. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిష్కరించి రైతులందరికీ న్యాయం చేయాలి.

– ధనేకుల వెంకట సుబ్బారావు, లేఅవుట్ అసోసియేషన్ అధ్యక్షుడు.

నీటి కాలుష్యంతో అనారోగ్యం పాలవుతున్నాం



60–40 ప్లాట్ల పక్క వెంచర్‌లోని అపార్ట్‌మెంట్‌లో 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. గత కొన్నాళ్లుగా ప్లాట్లలో డంపింగ్ చేస్తున్న కెమికల్స్ భూమిలోకి ఇంకిపోయి జల కాలుష్యం ఏర్పడి నీళ్ల రంగుకూడా మారింది. కొన్నాళ్లుగా డంప్ చేస్తున్న వేస్ట్ కెమికల్స్ ప్రభావం దాదాపు 4 కిలోమీటర్ల వరకు వ్యాపించింది. దాంతో మా అపార్ట్‌మెంట్‌లోని వారిలో చాలా మంది వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్లాట్ల రైతుల సమస్యను పరిష్కరించాలి.

– షేక్ సుభాని, కెఎస్ రెసిడెన్సీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, ఈగల్ వింగ్ ఐజీ రవికృష్ణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు చెప్పారు. సే నో టు డ్రగ్స్ పేరుతో విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాలలో డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజశేఖరబాబు హాజరై మాట్లాడారు. డ్రగ్స్‌తో జీవితాలు నాశనం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని నివారించడానికి ఈగల్ విభాగం ఏర్పాటైందన్నారు. డ్రోన్స్ ద్వారా గంజాయి సాగు ఎక్కడ జరుగుతుందో గుర్తించి నాశనం చేస్తున్నామని చెప్పారు. గంజాయి సేవించిన వారికి ఎన్డీపీఎస్ యాక్ట్ ప్రకారం శిక్ష పడుతుందన్నారు. గంజాయి నేరస్తుల జాబితాలో ఒక సారి పేరు నమోదైతే పాస్‌పోర్టు సైతం రాదని చెప్పారు. గంజాయి కోసం దొంగతనాలకు, నేరాలకు యువత పాల్పడుతున్నారని పేర్కొన్నారు. నగరంలో బ్లేడ్‌బ్యాచ్ ఆగడాల వెనుక గంజాయి ప్రభావం ఉందన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన స్నేహితులకు దూరంగా ఉండాలని, ఎవరైనా డ్రగ్స్ సేవించాలని బలవంతం చేస్తే ధైర్యంగా నో అని చెప్పాలన్నారు. కేవలం చట్టాల అమలుతోనే ఈ సమస్యకు పరిష్కారం దొరకదని, సమాజంలోని అందరూ కలిసి ముందుకు రావాలని వెల్లడించారు. అప్పుడే మత్తు పదార్థాలను నిర్మూలించగలమని చెప్పారు. సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

ప్రతి కళాశాలలో ఈగల్ టీమ్ బృందాలు

ఈగల్ వింగ్ ఐజీ (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్) రవికృష్ణ మాట్లాడుతూ ప్రతి కళాశాలలో ఈగల్ టీమ్ బృందాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్డీపీఎస్ యాక్ట్ కేసుల్లో ఇరుక్కుంటే 20 ఏళ్ల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. రెండు ఎన్డీపీఎస్ కేసుల్లో నిందితులుగా ఉంటే ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కేసు తీవ్రత ఆధారంగా మరణశిక్ష విధించే అవకాశం కూడా ఉందన్నారు. విద్యార్థులే ఈగల్ అంబాసిడర్లుగా ఉండాలని వివరించారు. గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిస్తే 1972 నెంబర్‌కి కాల్ చేయాలని చెప్పారు. విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లి విలువైన భవిష్యత్‌ను కోల్పోవద్దు సూచించారు. కార్యక్రమంలో ఈగల్ ఎస్పీ కె.నగేష్ బాబు, సెంట్రల్ ఏసీపీ దామోదర్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, ప్రిన్సిపాల్ ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు



హాజరైన విద్యార్థులు

వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దు

కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజలకు విజయవాడ నగర పాలక సంస్థ అందించే వసతులు, సౌకర్యాల కల్పనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు సూచించారు. బెంజ్ సర్కిల్, రామలింగేశ్వర నగర్, నేతాజీ బ్రిడ్జ్, ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. స్థానిక సమస్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఎక్కడా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పొంగకుండా ఎప్పటికప్పుడు ఫీల్డ్ విజిట్స్ చేస్తూ పరిశీలిస్తూ, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో తాగునీటి లీకేజీలను అరికట్టాలని, కల్వర్టులను మరమ్మతులు చేయాలని చెప్పారు. ప్రజా ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్త సేకరించాలని ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని సూచించారు. రామలింగేశ్వర్‌నగర్‌లోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పరిశీలించి మంచినీరు త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. అందుకు అనుగుణంగా రిపేర్లు సత్వరమే నిర్వహించాలని పేర్కొన్నారు. రామలింగేశ్వరనగర్‌లోని ఎస్టీపీను పరిశీలించి అమృత్ పథకం 2.0 ద్వారా జరుగుతున్న పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన నేతాజీ బ్రిడ్జ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ పరిశీలించి, అన్న క్యాంటీన్ నిర్వహణ సక్రమంగా జరగాలని, పరిశుభ్రమైన వాతావరణం, నెలకొల్పాలని, వాడుకనీరు మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు నిర్వహణ చేసుకుంటూ అధికారులు పర్యవేక్షిస్తుండాలని తెలిపారు. చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానెర్ జీవీజీ ఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈలు పి.సత్యనారాయణ, సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



రామలింగేశ్వరనగర్ వాటర్ ట్యాంక్ పనులు పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



విద్యార్థులకు పెన్ను, కుంకుమ, లడ్డూ పంపిణీ చేస్తున్న ఈవో రామచంద్రమోహన్, అర్చకులు



యోగశాల వద్ద పూర్ణాహుతి కార్యక్రమం చేస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు, ఈవో

అక్షరం దిద్దే వేళ..!

శ్రీ పంచమి నేపథ్యంలో దుర్గమ్మ సన్నిధిలో చిన్నారులకు సోమవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. మహామండపం ఆరో అంతస్తులో చిన్నారులతో అర్చకులు అక్షరాలు దిద్దించి పెన్ను, కుంకుమ అందజేశారు. పెద్దసంఖ్యలో తల్లిదండ్రులు తమ పిల్లలతో అక్షరాభ్యాసాలు చేయించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



శ్రీ పంచమి సందర్భంగా కనకదుర్గగుడిపై తమ పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

ఉగాది పురస్కారాలను పునఃప్రారంభించాలి

విజయవాడ కల్చరల్: ఉగాది, కళారత్న పురస్కారాలను కూటమి ప్రభుత్వం పునః ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ చిల్లర భవానీ దేవి కోరారు. సంఘం ప్రతినిధులు సోమవారం స్థానిక సంగీత కళాశాల కార్యాలయంలో భాషా సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకుడు పెంచలయ్యను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఏటా ఉగాది, కళారత్న పురస్కారాలను ప్రదానం చేసిందని, ఈ ఏడాది అదేవిధంగా పురస్కారాలను ప్రదానం చేయాలని కోరారు.

అమ్మవారి కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణ తలంబ్రాలను కలిపే కార్యక్రమాన్ని ఆలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఫిబ్రవరి 11న జరిగే శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణం అనంతరం భక్తులకు తలంబ్రాలు అందించేందుకు క్వింటా బియ్యాన్ని ముందుగా పసుపు, కుంకుమ, నెయ్యి, పలు సుగంధ ద్రవ్యాలతో భక్తులచే కలిపించారు. ముందుగా గ్రామంలోని రంగుల మండపం వద్ద నుంచి భక్తులు గోటితో వలిచిన తలంబ్రాలు బియ్యాన్ని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. వీటిలో కల్యాణ తలంబ్రాలను కలిపి కల్యాణ వేదిక వద్ద నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి అమ్మవారి కల్యాణం అనంతరం భక్తులందరికీ పంపిణీ చేస్తామని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఏఈఓ తిరుమలేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సతీమణి అమ్మాజీ, బీజేపీ జిల్లా నాయకురాలు కల్లూరి శ్రీవాణి, మాజీ సర్పంచ్ చింతల శ్రీలక్ష్మి, పాలకవర్గ సభ్యులు, మహిళా భక్తులుతదితరులు పాల్గొన్నారు.